

ఆర్‌యూ రిజిస్ట్రార్ రాజీనామా..
రెండు రోజులు కొనసాగాలని కోరిన వీసీ

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పదవీకి డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు రాజీనామా చేసి మాతృసంస్థ అయిన పరీక్షల విభాగం కంట్రోలర్ పోస్టుకు వెళ్లారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల తీరుతో మనస్తాపానికి గుర్రై, ఈ పదవి తనకు అవసరం లేదంటూ శనివారం నాడు సెలవుల్లో వెళుతున్నట్లు ఉపకులపతికి లేఖ అందించినట్లు సమాచారం.. స్పందించిన ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మరొకరిని నియమించే వరకు బాధ్యతల్లో కొనసాగాలని కోరినట్లు తెలిసింది.

మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నం

- పాతిన బండలను ధ్వంసం చేసిన అధికారులు
- ఆ స్థలం నాదేనంటున్న బీజేపీ నేత
- స్థలం విలువ రూ.కోటి



బండలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మిగనూరు, అక్టోబరు 7: ఎమ్మిగనూరు పట్టణంలో విలువైన భూమి కబ్జాకాకుండా అధికారులు అడ్డుకున్నారు. పట్టణంలోని ఎద్దుల మార్కెట్ ఎదురుగా ఉన్న రూ.కోటి విలువ చేసే ఐదు సెంట్ల స్థలాన్ని ఆదోనికి చెందిన ఓ రాజకీయ నాయకుడు శనివారం కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. స్థలంలో బండలను పాతేందుకు ప్రయత్నించడంతో మున్సిపల్ సిబ్బంది వాటిని ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వెల్లడించారు. పట్టణంలోని ఎద్దుల మార్కెట్ ఎదురుగా మైనార్టీ కాలనీకి వెళ్లే రోడ్డు, గోనెగండ్ల బైపాసురోడ్డు మధ్యలో సర్వేనెంబర్ 244లో ఐదు సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం మున్సిపాలిటిది అని బోర్డు సైతం ఏర్పాటు చేశారు. నిజానికి ఈ స్థలంలో మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కూడా అనుమతులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఆ ఐదు సెంట్ల స్థలం తమదేనని ఆదోనికి చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ చెబుతున్నాడు. కానీ మున్సిపల్ కమిషనర్ మాత్రం ఆ స్థలం వందశాతం మున్సిపాలిటీదేనన్నారు. ఆ స్థలం తమదని అనుమానం ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటివారైనా సరే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

2020లో లీగల్‌గా కొన్నా : కునిగిరి నీలకంఠ, బీజేపీ నేత 2020లో ఈ స్థలాన్ని లీగల్‌గా కొన్నా. ఆ స్థలం మున్సిపాలిటి పరిధిలోకి వస్తుందా..లేదా? అన్న విషయాన్ని గతంలో ఆర్టీఐ ద్వారా తీసుకున్నా. అందులో మున్సిపల్ అధికారులు ఈస్థలం మున్సిపాలిటీ చెందినది కాదని లెటర్ కూడా ఇచ్చారు. అయితే అప్పట్లో రాజకీయ నాయకులు అడ్డుపడడంతో అధికారులు సహకరించలేదు. దీంతో సమస్య అలాగే ఉండిపోయింది. అది నా స్థలం కావడంతోనే బండలు పాతేందుకు ప్రయత్నించా. అధికారులు మారడంతో వారికి తెలియక అడ్డుకున్నారు. నేను కొన్న ఆ స్థలం ప్రభుత్వానిదైతే నాకు అవసరం లేదు. నా స్థలాన్ని చూపించాలని స్థానిక ప్రజా ప్రతినిధి, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చాను.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుద్దాం

- మంత్రి టీజీ భరత్ పిలుపు
- స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 7: ఐదేళ్లలో కర్నూలు జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. అందుకోసమే ఐదేళ్ల అభివృద్ధి లక్ష్యాలతో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ రూపకల్పన చేస్తున్నామన్నారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్‌బాషా అధ్యక్షతన జిల్లా దార్శనిక ప్రణాళిక (2024-29) రూపకల్పనపై ప్రజాప్రతినిధులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలతో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గ్రోత్ ఇంజన్ అని, దీని వల్ల జిల్లాలో గణనీయమైన అభివృద్ధి సాధించనున్నామని పేర్కొన్నారు. దాదాపు రూ.2,800 కోట్లతో ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి కానుందని తెలిపారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రణాళికల రూపకల్పనలో వివిధ వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి విజయవాడకు ఫ్లైట్ నైట్ ల్యాండింగ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆదోని ప్రాంతంలో ఉన్న ఉమెన్ అండ్ చైల్డ్ ఆసుపత్రిలో ప్రతి నెలా సుమారు 450 ప్రసవాలు జరుగుతున్నాయని, పది మంది నర్సింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ప్రాంతానికి సాగు, తాగునీరు లభించేందుకు వీలుగా ఆర్డీఎస్ రైట్ కెనాల్ నిర్మాణం, గాజులదిన్నె రిజర్వాయరు అభివృద్ధి, వాటర్ గ్రిడ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలు-మంత్రాలయం రైల్వేలైన్‌కు కృషి చేయాలని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు
ఆమోదం!

- తొలి దశలో రూ.102.58 కోట్లు ఇవ్వనున్న ప్రపంచ బ్యాంక్



శ్రీశైలం డ్యాం వద్ద కాన్ఫరెన్స్ హాల్‌లో డ్యాం ఇంజనీర్లతో చర్చిస్తున్న ప్రపంచ బ్యాంక్ బృందం



ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

కర్నూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ప్రపంచ బ్యాంకు ఎట్టకేలకు ఆమోద ముద్ర వేసింది. డ్రిప్-2 నిధులతో తొలి దశలో రూ.102.58 కోట్లు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ బృందం, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రతినిధుల బృందం ఓకే చేశాయి. సోమవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు శ్రీరమేశ్, రాజ్‌గోపాల్‌సింగ్, ఆండీజెలెన్స్కీ, సీడబ్ల్యూసీ ప్రతినిధి డాక్టర్ హనీ, స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీరు (సీఈ) కుమార్ శ్రీశైలం ప్రాజెక్టు వద్దకు చేరుకుంది. డ్యాం భద్రత, చేపట్టాల్సి పనులపై ఇంజనీర్లతో సమీక్షించారు. సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషి ఫలితంగానే డ్రిప్-2 నిధులకు ఆమోదం లభించిందని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్టు సీఈ కబీర్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు.

శ్రీశైలం జలాశయానికి ప్లంజ్‌పూల్ గంత వల్ల ప్రాజెక్టు భద్రతకు ముప్పు పొంచి ఉందనే సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన నిపుణుల కమిటీలు డ్యాం భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. పలు సూచనలతో నివేదికలు ఇచ్చాయి. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ 2014 సెప్టెంబరు 23న ఆయా రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశం నిర్వహించారు. అప్పటి ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. శ్రీశైలం భద్రతపై అధ్యాయనం కోసం ఆయన నేతృత్వంలో కమిటీ అధ్యయనం చేసింది. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని కమిటీ, 2018 జూన్ 11, 12న జలవనరుల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ పి. రామరాజు ఆధ్వర్యంలోని కమిటీ, 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఏబీ పాండ్యా కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఛైర్మన్ వివేక్ త్రిపాఠీ నాయకత్వంలో ఎన్‌డీఎస్‌ఏ బృందం డ్యాంను పరిశీలించింది. కమిటీ ఏదైనా డ్యాం భద్రతపైన, ప్లంజ్‌పూల్ వల్ల ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశారు. పలు సూచనలతో నివేదికలు ఇచ్చారు.

● సీఎం చంద్రబాబు చొరవతో..:

గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా నిధులు రాలేదు. పైగా ప్రపంచ బ్యాంక్ కొర్రీలు పెట్టి వెనక్కిం పంపితే.. రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపారు. అయినా నిధులు ఇవ్వలేదు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం వచ్చాక శ్రీశైలం డ్యాం మరమ్మతులపై దృష్టి సారించింది.

● తొలి దశలో రూ.102.58 కోట్లు:

ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు శ్రీరమేశ్, రాజ్‌గోపాల్‌సింగ్, ఆండీజెలెన్స్కీ, సీడబ్ల్యూసీ ప్రతినిధి డాక్టర్ హనీ, స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీరు (సీఈ) కుమార్ బృందం సోమవారం మధ్యాహ్నం సమావేశమైంది. డ్యాం భద్రత కోసం తక్షణం చేపట్టాల్సిన పనులు, డ్రిప్-2 కింద ప్రతిపాదనలు పంపిన 19 పనులపై ప్రధానంగా చర్చించారు. ప్లంజ్‌పూల్ గుంత వల్ల ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పుపై కూడా వారు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. రూ.203.90 కోట్లలో.. ఫేజ్ కింద ప్రొటెక్షన్ సిలిండర్స్ మరమ్మతులు, అవసరమైన మేరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, ప్లంజ్‌పూల్‌పై అధ్యయం.. వంటి పనులు అత్యవసరంగా గుర్తించి ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు ఇస్తామని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు ఆమోదం తెలిపినట్లు సీఈ కబీర్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు.

స్కందమాతగా భ్రామరి

- శేష వాహనంపై ఆది దంపతులు
- కొనసాగుతున్న శరన్నవరాత్రి వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి క్షేత్రం



శేష వాహనంపై ఊరేగుతున్న ఆది దంపతులు

శ్రీశైలం, అక్టోబరు 7: శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. ఐదో రోజైన సోమవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా భక్తులను అనుగ్రహించారు. స్కందమాతగా ఆశీనురాలై చతుర్భుజాలు కలిగి పద్మం, కమలం, అభయహస్తం ధరించి, ఒడిలో బాల షణ్ముఖుడైన కుమారస్వామి (స్కందుడు)తో భక్తులకు దర్శనమిచ్చారు. శేషవాహనంపై శ్రీశైల మల్లన్నతో కలిసి అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకారమండపంలో శేషవాహనం అధిష్ఠించిన భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి వారికి ప్రధాన అర్చకులు, వేదపండితులు వాహనసేవను వైభవంగా జరిపించారు. ఉత్సవ అలంకరణలో భాగంగా స్కందమాతగా అమ్మవారు, మల్లికార్జునస్వామిని భక్తులు కనువిందుగా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆస్థానసేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ దక్షిణ మాడవీధిలో ఏర్పాటు చేసిన కళారాధన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్యాలు, సంగీత విభావరిని భక్తులు ఆద్యంతం తిలకించారు. వేడుకలను ఆలయ ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పర్యవేక్షించారు.

● నేడు కాత్యాయని అలంకరణ

దసరా ఉత్సవాల్లో ఆరో రోజు మంగళవారం భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు హంసవాహనసేవ, పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు.





శరన్నవరాత్రి వేడుకలను వీక్షిస్తున్న భక్తులు, భక్తుడి విన్యాసం





కళాకారుల ప్రదర్శనలు, ఉత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కర్నూలు, కల్లూరుకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు

కల్లూరు, అక్టోబరు 7: జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కీలకమైన కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తూ ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీజీఎస్ కళ్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన ఎస్ఆర్వోల జనరల్ బదిలీల్లో ఈరెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎవరూ అప్షన్ ఇవ్వకపోవడంతో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ల నియామకం జరగలేదు. ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చే కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ల నియామకంపై డీఐజీ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి లేఖ రాసి ఆయన అనుమతితో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లను నియమించారు. అందులో భాగంగా కర్నూలు రిజిస్ట్రార్ ఆఫీసు ఆడిట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును కల్లూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా ట్రైనీ డీఆర్ దీపిక, కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శశిధర్‌ను ఇన్‌చార్జి కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా నియమిస్తూ ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ తెలిపారు.

ఐఆర్, 12వ పీఆర్సీ అమలు చేయాలి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 7: ఉద్యోగులకు ఐఆర్, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ అమలు చేసిందన్నారు. 2022 సంవత్సరం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. విజయవాడలోని వరదలకు గురైన ప్రాంతాల్లో బాధితులకు ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగులు సహాయం చేశారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతం, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పించన్ అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, క్లాస్-4 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు, ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి. సులోచనమ్మ, గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య, జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ వి.గిరి కుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా చైర్మన్ పి. రామచంద్రరావు పాల్గొన్నారు.

నాణ్యతగా పరిమళ ప్రసాదం

- లాభాపేక్ష లేకుండా భక్తులకు పంపిణీ
- పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు



మంత్రాలయం, అక్టోబరు 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పరిమళ ప్రసాదాన్ని నాణ్యత ప్రమాణాలతో భక్తులకు అందజేస్తున్నామని మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అన్నారు. సోమవారం ఊంజల మండపంలో పీఠాధిపతి విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం రాఘవేంద్రస్వామి ప్రసాదం లాభాపేక్ష లేకుండా నాణ్యత ప్రమాణాలతో ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రుచికరమైన స్పటిక ఆకారంలో ఉండే ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్నామన్నారు. పరిమళ ప్రసాదంలో 100 కేజీల రవ్వకు 120 కేజీల చక్కెర, 30 కేజీల నెయ్యి, 5 కేజీల జీడిపప్పు, 5 కేజీల ద్రాక్ష, 200 గ్రాముల యాలకులు, 200 గ్రాముల జాజికాయ జాపత్రి, 200 గ్రాముల కేసరి కలర్ వినియోగిస్తావనాన్నరు. 19 మంది సిబ్బందితో రోజుకు 10 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు ప్రసాదాలను తయారు చేస్తున్నామన్నారు.

ఎంపీడీఓ, ఈఓఆర్డీ, డీఎల్పీఓలకు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్డీ, డీఎల్పీఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలలో సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర పది అంశాలపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు శ్రీకాళహస్తి ఐటీసీలో శిక్షణ పొందిన ఎంఓటీల ద్వారా శిక్షణ ఉంటుందన్నారు. 8,9,10 తేదీలలో జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఇచ్చే శిక్షణకు అధికారులు తప్పకుండా హాజరు కావాలని సీఈఓ పేర్కొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఓర్వకల్లు, అక్టోబరు 7: పత్తి పంట తెగుళ్లపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం డా. సుజాతమ్మ కోరారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవాన్ని (వరల్డ్ కాటన్ డే) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నంద్యాల వ్యవసాయ శాఖ కర్నూలు వారిచే సంయుక్తంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఏరువాక కేంద్రం కర్నూలు శాస్త్రవేత్త డా. సుజాతమ్మ పత్తిలో అధిక దిగుబడితో పాటు పత్తి నాణ్యతను పెంచడంతో రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్ విష్ణువర్ధన్, రవిప్రకాష్, చైతన్య కుమారి, రమాదేవి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శశిధర్ రెడ్డి, ఏవో బీవీ జీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వి స్వార్థ రాజకీయాలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్



కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: పసిపిల్ల చనిపోతే, దానికి రాజకీయ రంగు పులిమి తన స్వార్థ రాజకీయాలకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వాడుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పుంగనూరు పర్యటన ఎందుకు రద్దు చేసుకున్నారని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం అభం.. శుభం తెలియని పసిపపై నీచంగా మాట్లాడిన జగన్ కుట్రను పాప తల్లిదండ్రులు తిప్పికొట్టారని అన్నారు. తిరుపతి లడ్డూ కల్తీలో తన అక్రమాలపై విమర్శలను పక్కదారి పట్టించేందుకు పసిపాను అడ్డుపెట్టుకుని నీచ సంస్కృతికి తెగబడ్డారని ఆరోపించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

మహిళ మృతి : ఇద్దరికి గాయాలు

దొర్నిపాడు, అక్టోబరు 7: మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామ సమీపంలో ఆటో, బైక్ ఢీకొనడంతో షేక్. ఉసేన్‌బీ (44) అనే మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం భీమునిపాడు నుంచి డబ్ల్యూ. గోవిందిన్నెకు ఆటోలో కూలీ పనుల కోసం మహిళా కూలీలు వెళ్తుండగా డబ్ల్యూగోవిందిన్నె గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై చాకలి ప్రశాంత్ భీమునిపాడుకు వెళ్తుండగా డబ్ల్యూ. గోవిందిన్నె సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో ఆటోలో ఉన్న షేక్ ఉసేన్‌బీ, మరి కొందరికి గాయాలయ్యాయి. ఉసేన్‌బీ పరిస్థితి విషమంగా ఉండటంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉసేన్‌బీ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడ్డ మరి కొందరు మహిళలు కోవెలకుంట్ల ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఉసేన్‌బీ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

బన్నీ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు

హొళగుంద, అక్టోబరు 7 : రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవరగట్టు మాల మల్లేశర స్వామి బన్నీ మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆలయ పూజారులు మల్లయ్య స్వామి, మహేష్ స్వామి, మనోహర్ స్వామి సోమవారం తెలిపారు. నేరణికి గ్రామంలోని మల్లేశ్వర స్వామి దేవాలయంలో మళమ్మా, మల్లేశ్వర స్వామి విగ్రహం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో పురవీధుల్లో ఊరేగింపుగా దేవరగట్టుపై ఉన్న గిరికి గోరవయ్యలు, కంచే వీరబసవరాజు, రవి స్వామి తీసుకొచ్చినట్లు తెలిపారు. స్వామి అమ్మవారికి పూజారుల సమక్షంలో కంకణదారణ కార్యక్రమంతో బన్నీ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఈ నెల 12వ తేదీన బన్నీ ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

కాల్వబుగ్గ ఆలయంలో అవినీతి?



రూ.30 లక్షల అవినీతి... పూర్వ ఈవోపై ఆరోపణలు

కాల్వబుగ్గ రామేశ్వర ఆలయం

ఓర్వకల్లు, అక్టోబరు 7: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి బీఆర్‌కేవీ ప్రసాద్ రూ.30 లక్షల దాకా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాగంటి క్షేత్రానికి ఈవోగా పని చేస్తూ కాల్వబుగ్గకు రెండేళ్ల ఇన్‌చార్జి ఈవోగా ప్రసాద్ పని చేశారు. మొత్తంగా ఆరు సంవత్సరాలపాటు ఇక్కడే పనిచేస్తూ ఇటీవల యాగంటి క్షేత్రానికి బదిలీ అయ్యారు. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే కాల్వబుగ్గ దేవుని మాన్యంలో మూడు విద్యుత్ టవర్లు పోయాయని, ఒక్కో టవర్‌కు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఆలయ నిధులు కేటాయించారనే చర్చ జరుగుతోంది. సదరు అధికారి ఇటీవల బదిలీల్లో భాగంగా యాగంటి క్షేత్రానికి బదిలీ కాగా, ఓర్వకల్లు ఈవోగా పని చేస్తున్న మద్దిలేటిని కాల్వబుగ్గ రెగ్యులర్‌గా ఈవోగా నియమించారు. అయితే ఆయన ఇంత వరకు పదవీ బాధ్యతలు చేపట్టలేదు. ఆరోపణలపై దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌బాబును వివరణ కోరగా మంగళవారం ఈవో ప్రసాద్‌ను పిలిపించి విచారిస్తామని, ఆ తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా కాల్వబుగ్గ ఆలయానికి రాబడి తక్కువగా ఉంటుంది. ఇలాంటి చోట భారీమొత్తంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు రావడంపై సర్వత్రా అనుమానాలువ్యక్తమవుతున్నాయి.

పోలీసు ప్రజా ఫిర్యాదుల వేదికకు 132 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు, అక్టోబరు 7: స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి.

- కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన షేక్ సాదిక్, షేక్ తస్లీమా గుంటూరు చెందిన రవిలు కలిసి తమకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఫేక్ లెటర్స్ ఇచ్చి ఐదుగురి నుంచి రూ.30లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు బంగారు పేటకు చెందిన దివ్యాంగుడైన మురళీమోహన్ ఫిర్యాదు చేశారు.
- పెద్దల నుంచి వంశపారంపర్యంగా వచ్చిన మూడు ఎకరాల పొలాన్ని తమ వదిన సరోజ, రిటైర్డు ఉద్యోగి రత్నస్వామి మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తన పొలాన్ని, స్థలాన్ని ఇప్పించి న్యాయం చేయాలని గార్గేయపురానికి చెందిన దివ్యాంగుడైన దేవదానం ఫిర్యాదు చేశారు.
- జూలై 31న లొద్దిపల్లె హైస్కూల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తూ రిటైర్ అయ్యానని, ప్రభుత్వం నుంచి ఆర్డర్ కాపీ వచ్చిందని, స్కూల్‌లో పని చేస్తున్న హెడ్ మాస్టర్ ఎం.విజయభాస్కర్ పింఛన్ పత్రాలపై సంతకాలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు చెందిన రిటైర్డు ఉద్యోగి వెంకటరమణ రాజు ఫిర్యాదు చేశారు.
- ప్రైవేటుగా చిట్‌ఫండ్ పేరుతో చీటీలు వేసి 50 మంద బాధితుల నుంచి కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన తెలుగు నాగరాజు కుమారుడు దుర్గా ప్రసాద్ రూ.10 కోట్ల మేర డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని కర్నూలుకు చెందిన బాధితులు సురేష్, అశోక్, సునీల్, 12 మంది ఫిర్యాదు చేశారు.
- మొబైల్ చూస్తుంటే ఇన్‌స్టాగ్రాంలో ఆఫర్ వచ్చిందని, తక్కువ రేటుకే డ్రస్సులు, వస్తువులు వస్తాయని తన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో అప్లయ్ చేస్తుంటే నిమిషంలోనే సైబర్ నేరస్థులు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.18,800 మాయం చేశారని, న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన రిటైర్డు పోస్టుమాస్టర్ డేవిడ్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు, ఆదోని, గూడూరులలో గ్రూప్-4 ఉద్యోగాలు ఇప్పిస్తామని ముళ్ల చాంద్ మధ్యవర్తిత్వం చేసి తమ ముగ్గురు నుంచి రూ.20 లక్షలు తీసుకుని మధుసూదన్ అనే వ్యక్తి మోసం చేశాడని ఎమ్మిగనూరు, నందవరం చెందిన బాధితులు రాజు, వెంకప్ప, మురళి ఫిర్యాదు చేశారు.
- 30 మండి డిస్ట్రిబ్యూటర్లతో కర్నూలులో మసాలా వ్యాపారం చేస్తున్నానని, కంబంకు చెందిన మనోహర్ 8 నెలల పాటు కర్నూలు నుంచి మసాలాలు కొనుగోలు చేస్తున్నాడని. కొనగోలు చేసిన వాటికి రూ.25 లక్షలు తన బ్యాంకు ఖాతాలో వేయకుండానే డబ్బులు జమ చేసినట్లు ఫేక్ బ్యాంకు చలానాను పంపించి డబ్బులు తన ఖాతాకు పంపించానని మోసం చేస్తున్నాడని కర్నూలురు చెందిన వెంకన్న ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

పత్తి వాహనం బోల్తా

ఇద్దరు హమాలీల దుర్మరణం



బోల్తా పడిన పత్తి వాహనం



కురువ జమ్మన్న (ఫైల్)



జ్ఞాన వంతుడు (ఫైల్)

కర్నూలు, అక్టోబరు 7: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని జి.సింగవరం, కొంతలపాడు గ్రామ సమీపంలో పత్తి లోడుతో ఉన్న వాహనం బోల్తా పడి కురువ జమ్మన్న (40), జ్ఞాన వంతుడు (20) హమాలీలు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గద్వాల జిల్లా వడ్డెపల్లి మండలం తిమ్మాజిపల్లెకు చెందిన సుమారు ఏడుగురు హమాలీలు పత్తి లోడు చేసేందుకు బొలేరో వాహనంలో కర్నూలు జిల్లాకు వచ్చారు. లోడు చేసేందుకు ఓ వ్యాపారి వీరిని పిలిపించారు. కోడుమూరు మండలంలో పత్తిలోడు చేసుకుని నాగలాపురం, ఉల్చాల మీదుగా రాజోలి వెళ్తున్నారు. కొంతలపాడు వద్ద దూపాడు సమీపంలో డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో ఆటో అదుపు తప్పి పక్కనున్న వంకలోకి దూసుకెళ్లింది. దీంతో పత్తి లోడుపై భాగాన కూర్చున్న హమాలీలు వాగులో పడిపోయారు. వీరిపైన పత్తి పడటంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్థానికులు అప్రమత్తమై ఐదుగురిని బయటకు తీశారు. మిగతా ఇద్దరు బయటకు తీసేలోపే మృతి చెందారు. జ్ఞానవంతుడు, జమ్మన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన తర్వాత ఆటో డ్రైవర్ పరారయ్యాడు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

పది క్వింటాళ్ల పత్తి దగ్ధం

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



దగ్ధమైన పత్తి

మంత్రాలయం, అక్టోబరు 7: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో చిన్న ఏసేబు ఇంట్లో నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్నం రోడ్డులో చిన్న పిల్లలు టపాకాయలు పేలుస్తుండగా.. చిన్న నిప్పురవ్వ వచ్చి నిల్వ ఉంచిన పత్తిపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల పత్తిలో పది క్వింటాళ్లు దగ్ధం కాగా, స్థానికులు నీరు పోసి ఐదు క్వింటాళ్లను కాపాడుకున్నారు. ఆరు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసి మొదటి విడతగా తెచ్చిన పత్తి మరో రెండు రోజుల్లో అమ్మకం చేసుకునేందుకు సిద్ధంగా ఉంచిన పత్తి మంటలకు ఆహుతి కావడంతో మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాధవరం ఎస్ఐ విజయకుమార్, ఏఎస్ఐ బందెనవాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన పత్తిని అంచనా వేశారు. దగ్ధమైన పత్తికి నష్టపరిహారం అందజేసి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

దరఖాస్తులు రీ ఓపెన్ కాకూడదు

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే దరఖాస్తులపై సీఎంవో కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని, రీఓపెన్ కాకుండా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కర్నూలు అర్బన్, ఆదోని రూరల్, దేవనకొండ, గోనెగండ్ల, కల్లూరు మండలాల్లో అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించారు. పత్తికొండ ఆర్డీవోకు సంబంధించి 3, డీఐజీకి సంబంధించి 3, కర్నూలు ఆర్డీవోకు సంబందించి 1, సబ్ కలెక్టర్ ఆదోనికి సంబందించి 1, ల్యాండ్ అండ్ సర్వేకు సంబందించి 1, ఏస్‌డీవోకు సంబంధించి 1, ఆలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులకు 1 రీఓపెన్ అయ్యాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ 13, కర్నూలు ఆర్డీవో 9, పత్తికొండ ఆర్డీవో 2, డీఎస్‌వో 2, హౌసింగ్ 2, బీసీ సంక్షేమం 2, వ్యవసాయం 1, ఏవో కలెక్టరేట్ 1, నైపుణ్య అభివృద్ధి 1, డీపీవో 1, ఎంసీ గూడూరు 1, డీఆర్‌డీఏ పీడీ 1, ఆర్‌డబ్ల్యూఎస్ 2, డ్వామా 1, ఐసీడీఎస్ 1, పంచాయతీరాజ్ 1, ఏపీఐఐసీ 1 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్షయ, కుష్టు వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 7: క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓల్డ్ సీఎల్‌జీలో నోడల్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీబీ లెప్రసీ వ్యాధులను 2024 నాటికి పూర్తిగా అంతం చేయడం మనందరి పంతం అన్న లక్ష్యంతో పని చేయాలని ఆదేశించారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫంతో పాటు రాత్రి పూట జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు టీబీ వ్యాధిగ్రస్తులకు ఉంటాయని తెలిపారు. ఈ కుష్టు, క్షయ వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లికార్జున రెడ్డి, డీపీఎంవో విజయ ప్రకాష్, ఉద్యోగులు ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించండి

- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు, అక్టోబరు 7: దసరా పండుగకు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్తున్నారా..? అయితే దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ జి. బిందు మాధవ్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి గ్రామాలకు వెళ్లేవాళ్లు ఇళ్లకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9121101075 నెంబరును, లేదా స్థానిక పోలీసులను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాలకు పోటీ

- కర్ణాటక, తెలంగాణ నుంచి వెల్లువ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 797 దరఖాస్తులు
- ఒక దుకాణానికి దరఖాస్తులు నిల్

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: ప్రైవేట్ మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు ఈ నెల 9తో ముగియనుంది. జిల్లాలోని 99 దుకాణాలను దక్కించుకునేందుకు తీవ్ర పోటీ ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారుల అంచనా. సోమవారం సాయంత్రానికి దాదాపు 797 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ ద్వారా 310, ఆఫ్‌లైన్ ద్వారా 450 దరఖాస్తులు అందాయి. గడువులోపు 1500 దరఖాస్తులు చేరుకునే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలోని ఒక దుకాణానికి ఇంత వరకు ఒక్క దరఖాస్తు కూడా వేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లాతో పాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోసిగి, ఎమ్మిగనూరు ప్రాంతాలకు కర్నాటక, కర్నూలు నగరంతో పాటు చుట్టు పక్కల సమీప మండలాల్లోని దుకాణాలను దక్కించుకునేందుకు తెలంగాణ ప్రాంత వ్యాపారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2014-2019 మధ్య కూడా ఆయా రాష్ట్రాల వ్యాపారులే ఎక్కువ శాతం దుకాణాలు దక్కించుకుని వ్యాపారాలు కొనసాగించినట్లు ఎక్సైజ్ అధికారుల రికార్డులు సూచిస్తున్నాయి. ఆఫ్ లైన్ ప్రక్రియలో జిల్లాలోని 99 దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఆయా ఎక్సైజ్ పోలీస్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద దరఖాస్తులు చేసుకుంటున్నారు. సోమవారం సాయంత్రానికి ఆన్‌లైన్ కంటే ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో రింగ్ అయి దుకాణాలను దక్కించుకోవాలని కొందరు మద్యం వ్యాపారులు ప్రజా ప్రతినిధుల వద్ద మకాం వేసి దరఖాస్తులు వేసిన వారి వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, అక్టోబరు 7: మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన కురువ రాముడు (45) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. బంగ్లా ఏరియాలో నివాసముంటున్న ఆయన ఇంటి వద్ద మంచినీళ్ల మోటారు వేయడం కోసం స్విచ్ ఆన్ చేయగా కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. అతని భార్య గత కొంతకాలం క్రితం మరణించింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దళిత వాడలో ఘర్షణ

- పరస్పరం కర్రలతో దాడి
- ఏడుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, అక్టోబరు 7 : ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామ దళిత వాడలో ఘర్షణ చోటు చేసుకొంది. ఉలిగమ్మ దేవాలయానికి చెట్టుకొమ్మ అడ్డుగా ఉండడంతో తొలగించడానికి సర్పంచు భర్త భీమేష్‌తోపాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. తమ ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి పన్నాగం పన్నారని చిదానందతోపాటు మరికొందరు అక్కడికి వచ్చారు. ఈ క్రమంలో భీమేష్, చిదానంద వర్గాలవారు కర్రలతో కొట్టుకున్నారు. ఈ క్రమంలో ఏడుగురికి గాయాలు తగిలాయి. చిదానంద ఫిర్యాదుతో భీమేష్‌తోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- హైదరాబాదులో ఘటన

ఎమ్మిగనూరు, అక్టోబరు7: బీటెక్ చదివాక ఉద్యోగం కోసం హైదరాబాదు నగరానికి వెళ్లిన యువకుడ్ని అక్కడ రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న గురురాజు, రాజేశ్వరిలకు ఇద్దరు కుమారులు. వీరు గత కొంతకాలంగా కర్నూలులో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు జయప్రకాష్(22) బీటెక్ పూర్తి చేశాడు. అయితే స్థానికంగా ఉద్యోగాలు లేకపోవడంతో హైదరాబాదుకు చేరుకొని అక్కడ ఉద్యోగవేటలో పడ్డాడు. సోమవారం తెల్లవారుజామున బైకుపై బయటకు వచ్చాడు. ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టడంతో జయప్రకాష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాదుకు బయల్దేరి వెళ్లారు. మంగళవారం ఎమ్మిగనూరులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

బీఈడీ ప్రాక్టికల్స్ పునరుద్ధరించాలి

● కంట్రోలర్‌కు వినతి పత్రం ద్వారా వినతి



వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: ఇటీవల నిర్వహించిన బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు పునరుద్ధరించాలని అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విద్యార్థి సంఘం నాయకులు మధుకృష్ణ, రవీంద్ర, చిరంజీవి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రాక్టికల్స్ నిర్వహించారని ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రిజిస్ట్రార్‌పై దౌర్జన్యం చేయడం బాధాకరం

● ఆర్‌యూ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: బాధ్యతాయుతమైన రిజిస్ట్రార్ పదవిలో ఉన్న అధికారిపై దౌర్జన్యం చేయడం బాధాకరమని నాన్ టీచింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ వాపోయారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో ఓ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేయడం ఉద్యోగులను బాధించిందని వాపోయారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తా

● నగర అధ్యక్షుడిగా జిలానీ బాషా బాధ్యతలు



కాంగ్రెస్ కార్యాలయంలో జిలానీ బాషాను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: నగరంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జిలానీ బాషా అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల డీసీసీ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ, జే. లక్ష్మీనరసింహ యాదవ్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ, జె. లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల నాటికి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిపించుకుంటామని అన్నారు. అనంతరం మాజీ నగర అధ్యక్షులు జాన్‌విల్సన్‌తో పాటు నూతన అధ్యక్షుడు జిలానిబాషాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, దామోదరం రాధాకృష్ణ, పీజీ నరసింహులు యాదవ్, బతుకన్న, వెంకటసుజాత, అనంతరం రత్నం మాదిగ, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: దసరా నవరాత్రుల సందర్భంగా స్థానిక అశోక్‌నగర్ ప్రసన్నాంజనేయ, ద్వారకామాయి సాయిబాబ దేవాలయంలో మంగళవారం రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శనలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళావాహిని సాంస్కృతిక సాహితి స్రవంతి సభ్యులు మనోహర్‌బాబు సోమవారం తెలిపారు. స్రవంతి అధ్వర్యంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శన, హరికథాగానం, బుర్రకథాగానం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణుడిపడకసీను, భవాని చింతామణి తదితర పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు.

రైతులకు పప్పుశనగల పంపిణీ



రైతులకు పప్పుశనగలు అందజేస్తున్న అధికారులు

సి. బెళగల్, అక్టోబరు 7: మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, మండల టీడీపీ నాయకులు తిమ్మప్ప, ధనుంజయుడు, గఫూస్, బాలాజీ వెంకటేశ్ రైతులకు పప్పుశెనగలను అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ సి. బెళగల్ మండలానికి పప్పుశెనగలు 28 క్వింటాలు మంజూరు అయ్యాయని, మార్కెట్ ధర 9400 రూపాయలని, 25 శాతం సబ్సిడీ పోగా రైతులకు 7050 రూపాయలు చెల్లించాలని అన్నారు.

చదరంగం పోటీల కరపత్రాలు విడుదల

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 7: కలెక్టర్ కార్యాలయంలో రాజావర్ధన్ రెడ్డి మెమోరియల్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల కరపత్రాలను సోమవారం కలెక్టర్ పి. రంజిత్ బాషా చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కోడుమూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడో పాఠశాల డైరెక్టర్ కార్తీక్ నాయుడు, టోర్నమెంటు ఆర్గనైజర్ రవి నాయక్ పాల్గొన్నారు.

టెట్ పరీక్షకు 281 మంది అభ్యర్థులు గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్)అక్టోబరు,7: ఉపాధ్యాయ అర్హత (టెట్)పరీక్షకు మొత్తం 3,242 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు సెషన్స్‌లో 2,961 మంది హాజరుకాగా, ఇందులో 281 మంది అభ్యర్థులు గైర్హాజర్ అయ్యారు. సోమవారం ఉదయం జరిగిన టెట్ పరీక్షకు 1,619 మందికిగాను, 1,471 మంది హాజరుకాగా, ఇందులో 148 మంది గైర్హాజర్ అయ్యారు. అలాగే, మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు 1,623 మంది అభ్యర్థులకుగాను 1,490 మంది హాజరయ్యారు. టెట్ పరీక్ష కేంద్రాన్ని ఇన్‌చార్జి డీఈవో శ్రీనివాసులు, ఏడీ సామేల్ పాల్, సెంటర్ల డిపార్టుమెంటు ఆఫీసర్లు పరిశీలించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 7: కంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ కర్నూలు అడ్మినిస్ట్రేటివ్ అధికారి రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని 48వ వార్డు రోజావీధిలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. వైద్యశిబిరం సుశీల నేత్రాలయ హాస్పిటల్ అధినేత డాక్టర్ సుధాకర్‌రావు అధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమలత, కరెమ్మ, శేషమ్మ, నాగలక్ష్మి, పర్వీన్ నాగప్ప పాల్గొన్నారు.

సెలవుల్లో జిల్లా విద్యాశాఖ అధికారి

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 7: జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సోమవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు సెలవుల్లో వెళ్లారు. తన కుమారుడి వివాహం ఉండటంతో సెలవుల్లో వెళ్లారు. 13వ తేదీ ఆదివారం కావడంతో 14న తిరిగి విధుల్లో చేరనున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు డీఈవో ఏడీ-2 ఏ.శ్రీనివాసులు నిర్వహిస్తారు.

సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి

●అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ



అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న ఫిర్యాదుదారులు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 19 ఫిర్యాదులు అందాయి. వచ్చిన వాటిన్నంటిని త్వరతగతిన పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌ఓ జునైద్, ఎంఈ సత్యనారాయణ, డీసీపి సంధ్యారాణి పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదులు..

● 27వ వార్డు ఆదిత్యనగర్‌లో కాలనీలో కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

● కల్లూరు చెన్నమ్మ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక కూడలి ఏర్పాటు చేయాలని, ముజఫర్ నగర్ వరకు కొత్తగా రోడ్డు వేసి డివైడర్ ఏర్పాటుతో పాటు సెంట్రల్ లైటింగ్ వేయాలని డీవైఎఫ్ఐ నాయకులు హుస్సేన్, శివశంకర్ కోరారు.

●జగన్నాథ గట్టు టిడ్కో గృహల వద్ద మంచినీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే బియ్యం, పించన్ సరఫరా చేయాలని స్థానికులు కోరారు.

● గణేష్‌నగర్ నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో, వాణిజ్యనగర్, గీతానగర్‌లలో వర్షాలతో రహదారులు గుంతలుపడి బురదమయంగా మారుతున్నాయని వెంటనే డబ్ల్యూబీఎం రోడ్డు వేయాలని స్థానికులు కోరారు.

● ఒమేగా ఆసుపత్రి సమీపంలోని శ్రీవారి సుదర్శనం కాలనీలో తాగు నీటి సరఫరా ఏర్పాటు చేయాలని, మద్దూర్‌నగర్, ఠాగూర్‌నగర్ దుకాణాల ఎదుట చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారిపై నీరు నిల్వలు ఉంటున్నాయని డ్రైనేజీ సామర్థ్యం పెంచాలని, అశోక్‌నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట ఫుట్‌పాత్‌పై మట్టి పేరుకుపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించండి



కె నాగలాపురం గ్రామంలో కార్యదర్శికి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఏఈలు రామయ్య, శ్రీనివాసులు, ఏపీవో కుమారసాయి నాథ్ పాల్గొన్నారు.

సి. బెళగల్: మాభూములను అన్‌లైన్ చేయాలని మారందొడ్డి గ్రామానికి చెందిన రైతులు పాండు, సవారమ్మ, లింగమ్మ సోమవారం తహసీల్దార్‌కు విన్నవించారు. సోమవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి గ్రామ వీఆర్వోలతో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల భూసమస్యలను వారం లోపు పరిస్కరించాలని వీఆర్వోలకు ఆదేశించారు.

గూడూరు: కె.నాగలాపురం గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జె మోహన్ అన్నారు. సోమవారం గూడూరు మండలంలోని కె నాగలాపురం గ్రామంలో సీపీఎం నాయకులు కార్యదర్శికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, సుంకన్న, సత్యరాజు, దేవరాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, అక్టోబరు 7: రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. సోమవారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో 25 శాతం సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల ఆస్తులకు రక్షణ లేకుండా చేసిన ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు పుల్లారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు



మంత్రి భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: నగర పాలక సంస్థ పరిధిలోని 9,12 వార్డులకు చెందిన వైసీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో చేరారు. సోమవారం మంత్రి కార్యాలయంలో వీరు టీడీపీ కార్పొరేటర్ పుల్లమ్మ, మరో కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ అన్నెపోగు క్రాంతి కుమార్‌లకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతోనే వైసీపీని వీడి కార్పొరేటర్లు తమ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న ఐదేళ్లలో కర్నూలు రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తాన ని మంత్రి తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి మంత్రి టీజీ భరత్‌తోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో నవీన్, ఆనంద్, తదితరులు ఉన్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి



అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న పీపీఎస్ఎస్ సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: నగర పాలక పరిధిలోని పలు కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి. కృష్ణకు వినతి పత్రం అందజేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ స్వాంతంత్ర సమరయోధులు సుందరయ్య పార్కు గోడను కూల్చి వేసి ఓ కాంట్రాక్టరు దంపు యార్డుగా మార్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పాలకలో అభివృద్ధికి నోచుకోని పలుకాలనీల పార్కుల వివరాలను పుల్లారెడ్డి కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సీవీ.వర్మ, కే.శ్రీనివాసులు, టి.మద్దిలేటి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల బాలుడికి అరుదైన కిడ్నీ వ్యాధి

నయం చేసిన కిమ్స్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 7: ప్రపంచంలోనే అత్యంత అరుదైన కిడ్నీ వ్యాధి కర్నూలులో వెలుగు చూసింది. సరైన సమయానికి వ్యాధిని గుర్తించి రోగికి కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు చికిత్స అందించి ప్రాణాన్ని కాపాడారు. నగరానికి చెందిన బాలుడు గత రెండు నెలలుగా కాళ్లు, ముఖం వాపుతో ఇబ్బంది పడుతూ ఆసుపత్రికి వచ్చాడు. నెఫ్రాలజిస్టు డా.కే. అనంతరావు బాలునికి పరీక్ష చేయగా.. మూత్రంలో ప్రొటీన్ లీకేజీ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపి చేసి చూడగా బాలునికి అత్యంత అరుదైన లిపోప్రోటీన్ గ్లోమెరులోపతిగా డా. అనంతరావు గుర్తించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా, జపాన్ దేశాల్లో పెద్దలకు మాత్రమే వచ్చే ఈ కేసులు దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిదన్నారు.

కుక్క కాటు బాధితులకు నేడు పరిహారం

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: పాతబస్తీలో గత నెల 30వ తేదీన కుక్కల దాడిలో గాయపడిన బాధితులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రూ.10వేల నగదు ఆర్థిక సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో బాధితులకు డబ్బులు చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు బాధితులు ఈ పరిహారాన్ని తీసుకోవాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ప్రజా సేవకే అంకితమై పనిచేస్తా'



కేక్ తినిపిస్తున్న కార్యకర్తలకు నరసింహయాదవ్

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: ప్రజా సేవకే అంకితమైన పని చేస్తానని నంద్యాల జిల్లా డీసీసీ జెంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్‌లోని అన్ని నియోజవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాలస్వామి, రమణ, చెన్నయ్య, గుండాల కిరణ్, రాజాక్, వలీ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ జనరల్ సెక్రటరీ పొన్నా శివయ్య

కల్లూరు, అక్టోబరు 7: విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ వర్కర్లను రెగ్యులర్ చేసి వారికి రావలసిన అరియర్స్‌ను పూర్తి చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పొన్నా శివయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ భవన్‌లో సురేష్‌బాబు అధ్యతన చేపట్టిన కర్నూలు జిల్లా ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ కర్నూలు జిల్లా జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఎస్‌పీఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: కర్నూలు పోస్టల్ డివిజన్ పరిధిలోని బీఎస్‌పీఎల్ వినియోగదారులకు జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి ఆధ్యర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తపాల శాఖ అందిస్తున్న స్పీడ్ పోస్టు సర్వీసుల గురించి కర్నూలులోని హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలవారు వ్యాపార ఉత్పత్తులను విదేశాలకు సులువుగా పంపవచ్చని తెలిపారు. పోలీసు శాఖ, ఇన్‌కం ట్యాక్స్, ఎల్‌ఐసీ, ఆల్ ఇండియా, రేడియో, ఐడీబీఐ బ్యాంకు వంటి సంస్థల నుంచి పాల్గొన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రెహిమాన్, నూరుల్లా, గరీబ్ బాషా పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి రేణుక

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 7: స్థానిక ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీలో ప్రతినిత్యం నిర్వహిస్తున్న లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్, అదే కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఎం. రేణుక గత నెల రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 9న ఢిల్లీ నోయిడాలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బయలుదేరుతుందని తెలిపారు. ఈమేరకు ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీలో జరిగిన అభినందన సభలో రేణుకను ప్రిన్సిపాల్ డా.ఎం. ఇందిరా శాంతి అభినందించారు.

ముగిసిన యోగాసన పోటీలు

● ఒలింపిక్స్‌లో యోగా చేరబోతోంది : టీజీ భరత్



యోగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 7: యోగాసన స్పోర్ట్స్ క్రీడ ఒలంపిక్స్‌లో చేరబోతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో జరిగిన యోగాసన పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యోగా ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిందని అన్నారు. ముగింపు కార్యక్రమానికి ఎస్పీ బిందు మాధవ్, కేవీ సుబ్బారెడ్డి, ఏపీఎస్‌పీడీఎస్సీ మహబూబ్‌బాషా, రాష్ట్ర ప్రెసిడెంట్ రాధిక పాల్గొన్నారు.

నిత్యావసర ధరలను అదుపు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న గౌసదేశాయ్

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలను కూటమి ప్రభుత్వం అదుపు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్తీ కమిటీ అధ్వర్యంలో నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని గడియారం ఆసుపత్రి నుంచి పూలబజార్ వరకు ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ధరలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లేని, పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, జల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఎస్ఎండీ.షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

నగర పాలక సర్వసభ్య సమావేశం వాయిదా

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: 8న జరగాల్సిన నగర పాలక సర్వసభ్య సమావేశం అనివార్యకారణాల వల్ల వాయిదా వేసినట్లు నగర మేయర్ బీవై.రామయ్య సోమవారం తెలిపారు. సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

● నగర పాలక కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఆర్ఐలు ఎస్.శేషాద్రి, ఎం.రాజు, ఎస్.తిప్పన్న, పి.భార్గవ, ఎం.నాగరాజు విధుల్లో చేరారు. ఈ మేరకు అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం మేనేజర్ చిన్నరాముడును మర్యాదపూర్వకంగా కలిశారు.

రగ్బీ అండర్-19 బాలుర విజేత కర్నూలు జట్టు



రగ్బీ బాలుర కర్నూలు జట్టు

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 7: ఈ నెల 5, 6 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా పేదవేగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాల మైదానంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీల్లో కర్నూలు బాలుర జట్టు విజయం సాధించి బంగారు పతకాలు సాధించింది. కర్నూలు జట్టు విజయం సాధించడం పట్ల జిల్లా ఇంటర్ బోర్డు వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, ప్రాంతీయ ఇంటర్ బోర్డు అధికారి గురువయ్య శెట్టి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి. హర్షవర్ధన్, ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. రామాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ శేషయ్య అభినందించారు.

విద్యను బలోపేతం చేయాలి



మాట్లాడుతూ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఎస్ గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్)అక్టోబరు, 7: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ గోకారి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేసి, పాత పద్ధతిలోనే పాఠశాలలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు, శేఖర్, మూర్తిజావలి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే దస్తగిరి నివాళి



రాధాకృష్ణారెడ్డి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి

సి.బెళగల్, అక్టోబరు 7: మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన మాజీ మండల కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణారెడ్డి మృతి చెందిన విషయం తెలుకున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, టీడీపీ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, టీడీపీ మాజి మండల కన్వీనర్ నరసింహుడు, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సి బెళగల్ మండలంలోని పార్టీ అభివృద్ధికి రాధాకృష్ణారెడ్డి ఎంతో కృషి చేశాడని అన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఓర్వకల్లు, అక్టోబరు 7: మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన వివాహిత మద్దిలేటమ్మ (23) చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు సంతానం. చిన్న కూతురు పుట్టినప్పటి నుంచి మద్దిలేటమ్మకు ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఆమెను కర్నూలులో వైద్యులకు చూపించినా పరిస్థితి మెరుగుపడలేదు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 3న తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన భర్త, బంధువులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. మృతురాలి తల్లి కృష్ణవేణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కార్పొరేటర్‌గానే కొనసాగుతా

\- కైపా పద్మలతారెడ్డి

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: నగర పాలక సంస్థలో 17 వార్డు కార్పొరేటర్‌గానే కొనసాగుతానని కైపా పద్మలతారెడ్డి తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన మొట్టమెదటి కార్పొరేటర్‌ను అని, ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం పని చేశానని అన్నారు. పార్టీ అధిష్టానం గుర్తించి తనకు టూరిజం శాఖ డైరెక్టర్‌గా ఎంపిక చేసిందని తెలిపారు. అయితే రెండు పదవుల్లో కొనసాగలేనని, లేఖ ద్వారా తిరస్కరించానని చెప్పారు. కొందరు పని గట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. తనను డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ భరత్ అభినందించారని, పైగా తన తండ్రి కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్‌గా సమాజం కోసం సేవ చేశారని, అయినా కూడా తప్పుగా ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, అక్టోబరు 7: మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో కొండయ్య అన్నారు. సోమవారం ఎంపీడీవోను సర్పంచ్ బొమ్మనిపల్లి ఆంజనేయ, మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు, బసినేపల్లి తిమ్మప్ప, హరినాథగౌడ్, జడ్పీటీసీ డి.మురళీధర్‌రెడ్డి బండారు ఆంజనేయులు సన్మానించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

దేవనకొండ, అక్టోబరు 7: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సబ్సిడీ శనగ విత్తనాలు, టార్పాలిన్లను రైతులకు పంపిణీ చేశారు. రైతులకు ప్రోత్సాహకాలను ఇచ్చి, ఆదుకోవడమే ధ్యేయమన్నారు. ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, .ఏవో సురేష్‌బాబు, శాస్త్రవేత రాఘవేంద్ర, కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, రంగన్న, సుభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వీరేష్, బండ్లయ్య, మల్లికార్జునగౌడ్, భాస్కర్, హెచ్‌డీ నరసన్న పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

దేవనకొండ, అక్టోబరు 7: కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన పద్మావతి (33) పాముకాటుతో మృతి చెందింది. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. గుడిసెలో కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా ఆదివారం తెల్లవారు జామున పద్మావతిని పాము కాటువేసింది. భర్త చిన్నరాముడు కోడుమూరు తరలించగా, కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కోలుకోలేక సోమవారం పద్మావతి మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రైనీ డీఎస్పీగా ఉషశ్రీ

పత్తికొండ, అక్టోబరు 7: ట్రైనీ డీఎస్పీగా ఉషశ్రీ సోమవారం పత్తికొండలో బాధ్యతలు చేపట్టారు. 2022 గ్రూప్ -1 కు చెందిన ఆమె శిక్షణలో భాగంగా పత్తికొండలో పని చేస్తారు. సీఐ జయన్నతోపాటు సోమవారం పత్తికొండలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

కర్రల సమరానికి స్వస్తి పలకండి


స్వాధీనం చేసుకున్న కర్రలు

ఆలూరు, అక్టోబరు 7: దేవరగట్టు ఉత్సవాల్లో కర్రల సమరానికి స్వస్తి పలకాలని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ సూచించారు. సోమ వారం అరికెర, అరికెర తండాలో తనిఖీలు చేసి ఇనుప రింగు కర్రలతో పాటు ఎలాంటి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ప్రశాంత ఉత్సవాలకు భక్తులు సహకరించాలని కోరారు. సారా ఊటలను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అల్లర్లకు పాల్పడే వారిని విచారించి బైండవర్ చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు వెంకట నరసింహులు, చంద్ర పాల్గొన్నారు.

పార్కు ఏదీ..?

- ఆలూరులో ఒక్క పార్కూ లేదు
- సర్వే చేసి వదిలేసిన ప్రభుత్వం, అధికారులు


గ్రీన్ పార్కు కోసం కొలతలు వేస్తున్న అధికారులు (ఫైల్)

ఆలూరు, అక్టోబరు 7: పట్టణంలో కుటుంబ మంతా సేదదీరేందుకు ఒక్క పార్కు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు పనిచేసినా పట్టించుకున్నవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలూరులో 20 వేలకు పైగా జనాభా ఉండగా, ఎక్కడా వాకింగ్ చేయడానికి, సేద దీరడానికి కూడా అవకాశం లేదు. సాయంత్రం సమయంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు సేద దీరెందుకు స్థలం లేకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు.

మూతపడ్డ పార్క్.

ఆలూరు పట్టణంలో 20 ఏళ్ల క్రితం ప్రకాశం పార్క్ ఉండేది. అయితే ఆ స్థలంలో గ్రామ పంచాయతీ అధికాఉలు మన గ్రోమోర్ కేంద్రాన్ని నిర్మించారు. దీంతో పార్క్ లేకుండా పోయింది.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో గ్రీన్‌పార్కు విషయం పట్టించుకోలేదు. పార్కు ఏర్పాటుకు సుమారు రూ.20లక్షల వరకు ఖర్చయ్యే అవకాశముంది. ప్రభుత్వం ఈ పార్కును పట్టించుకోలేదు. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రశాంతంగా వెళ్లి సేద దీరెందుకు అవకాశం లేకుండా పోయింది..

కూటమి ప్రభుత్వంలోనైనా ఏర్పాటయ్యేనా?

కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా పార్కుకు మోక్షం లభిస్తుందా అని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. పంచాయతీ అధికారులు మండలంలో అభివృద్ధి పనులకు రూ.20కోట్ల మేర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు విడుదలైతే పార్కు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కు ఏర్పాటు చేయాలి



ఆలూరులో పార్కు లేక ఆహ్లాదం కరువైంది.. కుటుంబాలతో కలసి సేదదీరేందుకు అవకాశం లేదు. ఇప్పటికైనా స్పందించి పార్క్ ఏర్పాటు చెయ్యాలి **- శ్వేత, ఆలూరు**

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మరుగున పడిన ఆలూరు గ్రీన్ పార్క్ ఏర్పాటుపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. నిధల విడుదల కోసం వీలైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్‌కు విన్నవిస్తాం.
- వెంకప్ప, జనసేన ఇన్‌చార్జి

మరుగున పడిన గ్రీన్ పార్క్

పట్టణ శివార్లలోని బళ్లారి రోడ్డులో పార్క్ ఏర్పాటుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 1.50 ఎకరాలను కేటాయించారు. ఇందుకు ఎంపీడీవో, ఈవోఆర్డీ, సర్పంచ్ సర్వే చేయించి కొలతలు కూడా వేశారు. ముళ్లపొదలు తొలగించేందుకు, ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షల ఉపాధి నిదులను కూడా కేటాయించారు. ఇంకేమి పార్కు వస్తోందని ప్రజలు సంతోషించారు. అయితే ఆ సంతోషం నిలవలేదు. పనులు చేయకపోవడంతో నిదులు వెనక్కి వెళ్లాయి.

గృహ హింస కేసు నమోదు

పత్తికొండ, అక్టోబరు7: స్థానిక కోయనగర్‌కు చెందిన తిక్కమ్మ ఫిర్యాదు మేరకు గృహ హింస కేసునమోదు చేసినట్లు సీఐ జయన్న సోమవారం తెలిపారు. వివరాల మేరకు.. జూపాడుబంగ్లాకు చెందిన జయకుమార్‌తో ఏడాదిక్రితం వివాహం అయింది. భర్త, అత్తమామలు, ఆడపడుచు హింసిస్తున్నారని ఫిర్యాదు చేసింది. .

బాలిక మిస్సింగ్ కేసు

ఈనెలం 5వ తేదీ నుంచి తమ కూతురు కనిపించడం లేదని మండలంలోని పుచ్చకాయలమడ గ్రామానికి చెంది న తల్లిదండ్రులు పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. వివరాల మేరకు.. ఉదయం పొలానికి వెళ్లే సమయంలో ఇంట్లో ఉంది. తిరిగి వచ్చేసరికి కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ దొరక్కపోవడంతో ఫిర్యాదు చేశారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయన్న తెలిపారు.

మద్యం దుకాణాలు కేటాయించాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 7: గీత కార్మికులకు మద్యం దుకాణాలను కేటాయించాలని చేతివృత్తిదారుల సంఘం కార్యదర్శి కారన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం నూత మద్యం పాలసీలో పదిశాతం దుకాణాలను గీత కార్మికులకు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. వీరన్న, పెద్దహుల్తి సిద్దు, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

మద్దికెర, అక్టోబరు 7: కూటమి ప్రభుత్వంలో ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, మాజీ సర్పంచ్ వెంకటవర్మ అన్నారు. సోమవారం పెరవలి గ్రామంలో రూ.35 లక్షలతో సీసీ రహదారులు, కాలువల పనులను ప్రారంబించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కేంద్రం సహకారంతో పంచాయతీలకు నిధులు వచ్చాయన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మెడికల్ రాము ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సబ్ కలెక్టర్ మౌర్య


పత్తి మొక్క చూపుతున్న చిన్న

ఆదోని, అక్టోబరు 7: ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాల యంలో పబ్లిక్ గ్రీవెన్స్ డేలో అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన అర్జీలు కొన్ని..

పెద్ద తుంబలం గ్రామానికి చెందిన చిన్న తనకు మూడు ఎకరాల పొలంలో పత్తి వేశానని, కాపు రాలేదని, విత్తనాలమ్మిన వారిపై చర్యతీసుకుని న్యాయం చేయాలని కోరాడు. 19 వార్డుకు చెందిన వెంకటేశులు తనకు దివ్యాంగుల సంక్షేమం కింద సబ్సిడీ ద్విచక్ర వాహనం సబ్సిడీ మంజూరు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

మండలంలోని కడితోట గ్రామానికి చెందిన షాషా వలి తనకు సర్వే నెంబర్ 40/సీలో 0.31, 40/డీలో 0.62, 40/ఈ లో 0.34 మొత్తం 1.29 ఎకరాలు పెద్దల నుంచి సంక్రమించిందని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కోరారు.

సాంబాబుగల్ గ్రామానికి చెందిన హరిజన ప్రాన్సిస్ తనకు సర్వేనెంబర్ 188/4లో 2.10 ఎకరాలు ప్రభుత్వం నుంచి డి.పట్టా వచ్చిందని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరాడు. సర్వేయర్లు శ్రీనివాస రాజు, వేణు సూర్య, డీఎల్‌డీపీవో, నూర్లహాన్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ పద్మజ, హౌసింగ్ డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు ఇవ్వాలి

దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఇప్పించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు టీడీపీ నాయకుడు శ్రీనివాసాచారి వినతిపత్రం సమర్పించారు. మండగిరి కాలనీలో కొంతమంది మందికే ఇచ్చారని, అర్హులందరికీ ఇవ్వాలని కోరాడు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం



గోనెగండ్ల: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, నందవరం: చెక్కు పంపిణీ

గోనెగండ్ల, అక్టోబరు 7: ప్రజలకు సుపరిపాలన అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం గోనెగండ్లలో ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో కలసి కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందకు మండలస్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఎర్రబాడు గ్రామానికి చెందిన చిన్నరాముడు తనక పొలం ఆన్‌లైన్‌లో ఆర్‌ఓఆర్ ఎక్కించాలని కోరారు. గోనెగండ్ల కు చెందిన ఇమ్మానుయేల్ తనకు అర్హత ఉన్న పింఛన్ రావడంలేదని విన్నవించారు. ఐరన్‌బండకు చెందిన భాగ్యమ్మ తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో మణిమంజరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ శివశంకర్, సీఐ గంగాధర్, టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, తిరుపత య్యనాయుడు, బేతాలబడేసా, ఎర్రబాడు శ్రీనివాసులు, నూర, సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పుట్టపాశం వెంకటేశ్వరాచారి, హనుమంతు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ:

రైతులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. బీసీ కాలనీ రైతు సేవా కేంద్రం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, సిబ్బంది టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీయం సహాయ నిధి చెక్కు పంపిణీ

నందవరం: తలలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న నందవరానికి చెందిన బోయ రవికి సీఎం సహాయనిధికి కింద రూ.2లక్షలను ఎమ్మెల్యే అందజేశారు.

నాగలదిన్నెను పరిశీలించిన డీఎస్పీ


నదిని పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం, అక్టోబరు 7: మండలంలోని నాగలదిన్నెను సోమవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పరిశీలిం చారు. ఇక్కడ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తుంగభద్ర నదిని సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే తెలంగాణ, ఆంధ్రపదేశ్‌ను అనుసంధానించే బ్రిడ్జిని పరిశీలించారు. అక్రమ మద్యం రవాణాపై నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తాలుకా సీఐ విక్రమ్ సింహ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

దేవనకొండ, అక్టోబరు 7 : పొలంలో నీటికుంటలో పడి కుంకనూరు గ్రామానికి చెందిన ఆనంద్ (35) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... ఎల్లమ్మ గుడి వద్ద పొలంలో పని చేసేందుకు భార్య ఉమాతో ఆనంద్ వెళ్లాడు. మధ్యాహ్నం నీళ్ల తాగేందుకు వెళ్లి కుంటలో పడ్డాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా ఆనంద్ ఆచూకి కనిపించలేదు. బంధువులు మృతదేహాన్ని బయటకు తీశారు.

దరఖాస్తుదారులను బెదిరిస్తే చర్యలు


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావ్

ఆలూరు, అక్టోబరు 7: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేవారిని బెదిరిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 9 చివరి తేదీ అన్నారు. దేవరగట్టు ఉత్సవాల్లో నాటుసార నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సుపరిండెంట్ రాజశేఖర్ గౌడ్, ఆలూరు సీఐ లలిత దేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం

తుగ్గలి, అక్టోబరు 7: పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తా మని కార్యదర్శులు నారాయణస్వామి, రాజునాయక్ అన్నారు. సోమవారం పగిడిరాయి, జొన్నగిరి గ్రామ పంచాయతీల కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ ఎర్రనాగప్ప, సర్పంచులు ఓబులేసు వారిని సన్మానించారు. ప్రభుత్వ నిధులతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని, పారిశుధ్య పనులు చేపడుతూ గ్రామంలోనే ఉంటూ ప్రజ లకు సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ, సర్పం చులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు బాలన్న, రవి యాదవ్, సురేష్, శివరాం చౌదరి, శేఖర్ తదితరులు ఉన్నారు.

శాకంబరీదేవి అలంకరణలో మంచాలమ్మ


తులసి, కూరగాయలతో అలంకరణ

మంత్రాలయం, అక్టోబరు 7: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంత్రా లయంలో శాకంబరీ దేవిగా మంచాల మ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధి పతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేసి హారతులు ఇచ్చారు.

పీఠాధిపతి తులాభారం:

పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులకు హిందూపురానికి చెందిన భక్తులు తులాభారం నిర్వహించారు. ఒక వైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, మరో వైపు బెల్లం, కందిపప్పు, బియ్యాన్ని ఉంచి తూచారు. అనంతరం తులాభారం చేసిన భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్పం మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, వ్యాసారాజాచార్, పద్మనాభాచార్ పాల్గొన్నారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. సోమవారం నవరాత్రిల్లో చవితి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. అంతకుముందు ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి మంగళహారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి...

పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు సోమవారం ధార్మిక పర్యటనకు తన శిష్య బృందంతో బయలుదేరి వెళ్లారు. రెండు రోజులు మైసూరు ప్యాలెస్ విజయదశమి ఉత్సవాల్లో పాల్గొని బుధవారం మంత్రాలయానికి రానున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

నందవరం, అక్టోబరు 7: తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఐ తాలుకా నాయకులు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అధికార పార్టీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అధికారులకు తెలిసినా చోద్యం చూస్తున్నారని ఆరోపిం చా రు. తాలుకా కార్యదర్శి శాంతన్న, మండల కార్యదర్శి గిడ్డయ్య, మునిస్వామి, లింగన్న, దేవరాజు, తిమ్మప్ప, రామలింగడు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి


మాట్లాడుతున్న రాఘవేంధ్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 7: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంధ్రరెడ్డి అన్నా రు. సోమవారం మాట్లాడుతూ కోసిగి, కౌతాళం, పెద్దకడ బూరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మం జూరయ్యాయని అన్నారు. 14 నుంచి 21 వరకు పల్లె పం డుగ పేరుతో భూమి పూజ చేస్తామన్నారు. గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని నిధులు మంజూరు కాగానే పరిష్కరిస్తామ న్నారు. ఆర్ అండ్‌బీ రోడ్ల మరమ్మ తులకు రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మరో రూ.6 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎంకు అందజే శామన్నారు. కోసిగి మండలం సజ్జగుడ్డం, దేవరబెట్ట మధ్య వంతెన, రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నీటి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు సిద్ధం చేశా మన్నారు. మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమేష్, బొజ్జప్ప, రామకృష్ణ, షఫీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు7: స్థానిక సోమప్ప సర్కిల్‌లో గోవిందమ్మ చేస్తున్న నిరాహార దీక్ష సోమవారం ఆరో రోజు కొనసాగింది. న్యాయం చేసేదాకా రిలే నిరహార దీక్షలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రంగన్న, నరసన్న సమతా సైనిక్ దళ్ రంగయ్య డిమాండ్ చేశారు. గోవిందమ్మపై దాడి ఘటనపై కలెక్టర్, ఎస్పీ, హోం మంత్రి, మానవహక్కుల కమిషన్‌లు వచ్చే వరకు పోరాడుతామన్నారు. చార్లెస్, మాజీ కౌన్సిలర్ మధుబాబు, అమరేష్, నరసప్ప, బతుకమ్మ, సామెల్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ఆదోని: కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమో దు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్యకు వినతిపత్రం అందజేశారు. గోవిందమ్మ కుమారుడు ఈరన్న, చాకలి నాగలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్న కక్షతో అగ్ర కులాల పెత్తందారులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మూకుమ్మడి దాడి చేసిన వారిని అరెస్టుచేసి గ్రామ బహిష్కరణ చేయాల న్నారు. సుజ్ఞానమ్మ, కళావతి ఓబుళపతి, వెంకప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.